ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
కామారెడ్డి జిల్లా వార్తలు
5
శనివారం 27 సెప్టెంబరు 2025



బోణీ షురూ..

మద్యం టెండర్లకు మొదటి రోజు ఒకే ఒక్క దరఖాస్తు



దరఖాస్తు చేస్తున్న అలీ

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాల టెండర్లకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీంతో శుక్రవారం కామారెడ్డి జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో టెండర్లకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియను చేపట్టారు. ఈ ప్రక్రియలో బాన్సువాడ స్టేషన్ పరిధిలో ఒకే ఒక్క దరఖాస్తు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంత్‌రావు తెలిపారు. షాప్ నెంబరు 33 కోసం అలీ అనే వ్యక్తి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 49 మద్యం దుకాణాలు ఉండగా కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 15, దోమకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 8, ఎల్లారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 7, బాన్సువాడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 9, బిచ్కుంద ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 10 ఉన్నాయని తెలిపారు.

మద్యం దుకాణాల రిజర్వేషన్లు ఇలా..

జిల్లాలో 49 మద్యం దుకాణాలు ఉండగా అందులో రిజర్వేషన్ల ప్రకారం గౌడ కులస్తులకు 7, ఎస్సీ కమ్యూనిటీకి 5, ఎస్టీ కమ్యూనిటీకి 2 కేటాయించారు. మిగతా 35 ఓపెన్ క్యాటగిరికి కేటాయించారు. గౌడ సామాజిక వర్గానికి రిజర్వు అయిన మద్యం దుకాణాలు ఇలా సదాశివనగర్ మండల కేంద్రంలో షాప్ నెం. 13, బీబీపేట మండల కేంద్రంలోని షాప్ నెం. 21, లింగంపేట మండల కేంద్రంలోని షాప్ నెం.26, జుక్కల్ మండలంలోని షాప్ నెం.42,43, మద్నూర్ మండల కేంద్రంలోని షాప్ నెం.44, పిట్లం మండల కేంద్రంలోని షాప్ నెం.46, ఎస్సీ సామాజిక వర్గానికి రామారెడ్డి మండల కేంద్రంలోని షాప్ నెం.10, ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని షాప్ నెం.24, బాన్సువాడ పట్టణ కేంద్రంలోని షాప్‌ల నెంబర్లు 31,32, నసురులాబాద్ మండలంలోని దుర్కి విలేజ్ షాప్ నెం.38, ఎస్టీ సామాజిక వర్గానికి రిజర్వు అయిన మద్యం దుకాణాలు బీబీపేట మండల కేంద్రంలోని షాప్ నెం. 20, బాన్సువాడ కేంద్రంలోని షాప్ నెం.35 కేటాయించారు.



అంకోల్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను
వేగవంతం చేయాలి : సబ్ కలెక్టర్

నసురుల్లాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. శుక్రవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంతో పాటు అంకోల్, కంషేట్‌పల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న ఇంది రమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు లబ్ధిదారులు త్వరగా చేపడితే విడతల వారీగా బిల్లులు అందుతాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సువర్ణ, ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్, ఆయా గ్రామాల పంచాయతీ సెక్రెటరీలు రాజేష్, సౌందర్య, లబ్ధిదారులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



కాటేవాడిలో పూత, కాత కాయని పత్తి

'పత్తి' మీద సాగు

జిల్లాలో పత్తి పంటపై విపత్తుల ప్రభావం తీవ్రంగా పడుతోంది. సాగు నీటి వనరులు లేక అనేక ప్రాంతాల్లో రైతులు వర్షాధార పంటలు అయిన పత్తిని వేల ఎకరాల్లో సాగు చేశారు. అయితే మొదట్లో ఎండలు, ఇప్పుడు భారీ వర్షాలు పత్తి రైతును చిత్తు చేస్తున్నాయి. సీజన్ మొదట్లో వర్షభావ పరిస్థితులతో మొక్కలు ఎండిపోగా ఉన్న కొద్ది గొప్పో మొక్కలను కాపాడిన రైతులకు ఇప్పుడు వర్షాల రూపంలో ఇబ్బందులు తప్పడం లేదు. భారీ వర్షాలు, వరదల వల్ల పంటలు నీట మునిగి దెబ్బతింది. తర్వాత చీడపీడలతో పత్తి పూత, కాత కాయలేని పరిస్థితి ఎదురవుతోంది. రోజుల తరబడి పత్తి మొక్కలు ఉండడంతో మురిగిపోయాయి. ఇలా భారీ వర్షాలు వరదల వల్ల పత్తి దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు, మూడు సంవత్సరాలు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో ఈ సారి రైతులు పత్తి పంట సాగుపై ఆసక్తి చూపారు. తీర భారీ వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

- భారీ వర్షాలతో పత్తికి నష్టమే
- జిల్లాలో దిగుబడులపై తీవ్ర ప్రభావం
- ఎకరాన మూడు క్వింటాళ్ల వరకు దిగుబడులు తగ్గే అవకాశం
- పూత, కాత కాయని పరిస్థితి
- జిల్లాలో 31 వేల ఎకరాల్లో పత్తి సాగు
- 2700 మెట్రిక్ టన్నుల దిగుబడులకే పరిమితం

కామారెడ్డి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కువగా రైతులు వర్షాధార పంటలను సాగు చేస్తుంటారు. ప్రతీ వానాకాలం సీజన్‌లో సోయా, పత్తి, మొక్కజొన్న పంటలను వేల ఎకరాల్లోనే వేస్తుంటారు. ప్రధానంగా పత్తి సాగుపై రైతులు ఆసక్తి చూపారు. నీటి వసతులు లేని జుక్కల్, పెద్దగొడప్‌గల్, పిట్లం, బిచ్కుంద, మద్నూర్, సదాశివనగర్, గాంధారి, తాడ్వాయి, రాజంపేట, రామారెడ్డి తదితర ప్రాంతాల్లో రైతులు వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 31వేల ఎకరాల్లో వానాకాలం సీజన్‌లో పత్తి సాగయింది. గత రెండు, మూడు సంవత్సరాలుగా మార్కెట్‌లో పత్తికి మంచి డిమాండ్ ఉండడంతో జిల్లా రైతులు పత్తి పంటపై ఆసక్తి చూపారు. ఈ సారి కూడా మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశతో ఉన్నారు. కానీ వరదలు నష్టం చేకూర్చాయి. వరదల వల్ల సుమారు 800ల ఎకరాల వరకు పత్తి పంట నష్టం చేకూరినట్లు వ్యవసాయ శాఖ నిర్ధారించింది.

నల్లరేగడి భూముల్లో పత్తికి ఇబ్బందులు

పత్తి పంట సాధారణ పరిస్థితుల్లోనైతే నల్లరేగడి భూముల్లోనే అధిక దిగుబడులు ఇస్తుంది. మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతుల పాలిట పత్తి తెల్ల బంగారమే అవుతుందని రైతులు చెబుతున్నారు. కానీ నల్లరేగడి భూముల్లో తేమ శాతం ఎక్కువగా ఉంటే పత్తి పంట ఎదుగుదశలో ప్రభావం (మిగతా 8వ పేజీలో)

పూత, కాత రాలిపోతుంది


- ఆకుల రాంచందర్, పత్తి రైతు, పెద్దకొడప్‌గల్



గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షాలు కురవడంతో పంటకు అవసరం మించిన మోతాదులో నీరు రావడంతో పత్తి మొక్కలు వాడిపోవడంతో పాటు పూత, కాత రాలిపోతున్నాయి. సుమారు ఒక్కో చెట్టుకు 15 నుంచి 20 కాయలు రాలిపోయాయి. దీంతో పత్తి దిగుబడిపై ప్రభావం పడనుంది. నాలుగు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాను. ఆశించిన మేర దిగుబడులు వచ్చే అవకాశం లేనట్లు కల్పిస్తోంది.

దిగుబడులు తగ్గే అవకాశం

- మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



భారీ వర్షాలతో పత్తి పంటపై ప్రభావం పడుతుంది. దిగుబడులు సైతం తగ్గే అవకాశం ఉంది. భారీ వర్షాల కారణంగా పత్తి మొక్క ఎదగకపోవడం, పూత, కాత కాయకపోవడంతో పత్తి వచ్చే అవకాశం లేదు. మూడు, నాలుగు రోజుల పాటు పత్తి వరదల్లోనే ఉండడంతో ఈ సమస్య తలెత్తుతోంది. ఎకరాన మూడు క్వింటాళ్ల వరకు దిగుబడులు తగ్గి 7 క్వింటాళ్లకే పరిమితమయ్యే అవకాశం ఉంది.

స్థానిక ఎన్నికలకు
రంగం సిద్ధం

- బీసీ రిజర్వేషన్లపై ప్రత్యేక జీవో జారీ చేసిన ప్రభుత్వం
- నేడు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసే అవకాశం
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఎన్నికల కమిషన్ సమావేశం

కామారెడ్డి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ప్రభుత్వం నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇది వరకే ఓటరు జాబితాను ప్రకటించగా ఇటీవల రిజర్వేషన్ల ప్రక్రియను కూడా పూర్తి చేశారు. తాజాగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవోను తీసుకువచ్చింది. ఇందులో భాగంగా జీవో 9ని శుక్రవారం విడుదల చేసింది. ఈ ప్రత్యేక జీవో ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదిలా ఉండగా శనివారం స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ సమావేశంలో చీఫ్ సెక్రెటరీ, డీజీపీలతో పాటు కలెక్టర్లు, ఎస్పీలతో ఈసీ సమావేశం నిర్వహించిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

రిజర్వేషన్ల కోసం ప్రత్యేక జీవో

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను కల్పించాలని ఇది వరకే చట్ట సభల్లో రాష్ట్ర ప్రభుత్వం బిల్లు ప్రవేశ పెట్టి గవర్నర్, రాష్ట్రపతికి రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. అయితే అక్కడ నుంచి ఆమోదం రాకపోవడంతో ప్రత్యేక జీవో తీసుకువచ్చి రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా శుక్రవారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీవో-9ని ప్రభుత్వ విడుదల చేసింది. ప్రత్యేక జీవో ఆధారంగా రిజర్వేషన్లు కల్పించనున్నారు. ఇప్పటికే జిల్లాలో అధికార యంత్రాంగం గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, ఎంపీటీసీల రిజర్వేషన్లను ఖరారు చేశారు. జిల్లాలో 535 పంచాయతీలు ఉన్నాయి. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఇందులో 224 సర్పంచ్ స్థానాలు బీసీలకు వచ్చే అవకాశం ఉంది. అదే విధంగా 25 జడ్పీటీసీ స్థానాలు ఉండగా 11 బీసీలకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి.

నిజాంసాగర్‌లోకి పోటెత్తిన వరద

- 13 గేట్లు ఎత్తివేత
- 87 వేల 709 క్యూసెక్కుల వరద నీరు మంజీరా నదిలోనికి విడుదల
- మంజీరా వెంట 74 వేల 367 క్యూసెక్కుల వరద
- నిజాంసాగర్ ప్రధాన కాలువ వెంట 1250 క్యూసెక్కుల నీరు విడుదల



వీఆర్ నెంబర్ ఎనిమిది గేట్లను ఎత్తివేసిన దృశ్యం

నిజాంసాగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టులోకి మంజీరా వెంట భారీ వరద నీరు వస్తూనే ఉంది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు వీఆర్ నెంబర్ నాలుగులోని 8 గేట్లు, 20 గేట్లలోని 5 గేట్లను ఎత్తి శుక్రవారం 87వేల 709 క్యూసెక్కుల వరద నీటిని వదిలివేస్తున్నారు. నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి 1250 క్యూసెక్కుల నీటిని వదులుతూ ఉన్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 1405 అడుగులకు గాను 1401.74 అడుగుల నిల్వ చేస్తూ మంజీరా నది వెంట వచ్చే వరద నీటిని మంజీరాలోకి విడుదల చేస్తున్నారు. ఆగస్టు 18 నుంచి 39 రోజుల పాటు నిజాంసాగర్ నుంచి వరద మంజీరా నదిలోనికి విడుదల చేస్తున్న పాఠకులకు తెలిసిందే. 40 ఏళ్ల తరువాత నిజాంసాగర్ వరద గేట్లు నిరాటకంగా కొనసాగుతూ ఉండటం మొదటిసారి అని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 191.870 టీఎంసీల వరద నీరు రాగా వరద గేట్ల ద్వారా 178.410 టీఎంసీల నీటిని మంజీరా నదిలోనికి వదిలారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 17.802 నీటి సామర్థ్యం కలది. ఏడాది 1.15 ఎకరాలకు సాగునీరు అందించేందుకు నీటి పారుదల శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు.

భూమి కోసం పోరాడిన వీర వనిత ఐలమ్మ

- కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్



కామారెడ్డిలో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన వీర వనిత ఐలమ్మ అని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద గల ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకారులను ఎదురించి పోరాడిన వీర వనిత అన్నారు. ఆమె పోరాటస్ఫూర్తిని అందరు ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. తెలంగాణ రైతంగ పోరాటానికి ప్రతీక అని బహుజన సమాజానికి ధైర్యం, పోరాటస్ఫూర్తి నింపిన మహనీయురాలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జయరాజ్, సహాయ అధికారి చక్రధర్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి నాగరాజు, బీసీ సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల అవగాహన కలిగి ఉండాలి

సదాశివనగర్: ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికలపై పూర్తి అవగాహన కలిగి ఉంటేనే ఎన్నికలు సజావుగా కొనసాగుతాయని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం సదాశివనగర్ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరగాలంటే ప్రిసైడింగ్ (మిగతా 8వ పేజీలో)

దేవాలయాల దోపిడీ ముఠా అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రాజేష్‌చంద్ర

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో దోపిడీ చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. భిక్కనూరు పోలీసుస్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 44పైన కొందరు వ్యక్తులు ఆటో వచ్చి బస్వాపూర్ పెద్దమ్మ గుడి తాళం పగులగొట్టి హుండీలోని రూ.5వేలు, ఎలమ్మ గుడి తాళం పగులగొట్టి రూ.1000లు దొంగిలించుకపోవడంతో ఈ నెల 10న భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయిందని తెలిపారు. కేసు ఛేదనకు ఏఎస్పీ చైతన్యారెడ్డి ఆధ్వర్యంలో రెండు స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేసిన దర్యాప్తు చేపట్టగా అంతర్రాష్ట్ర ముఠాలోని సదాశివనగర్ మండలం గాంధారి సత్యం, మహారాష్ట్రలోని సయ్యద్ సమీర్, అహ్మద్ పటాన్‌లుగా గుర్తించామని తెలిపారు. ఇందులో గాంధారి సత్యం, సయ్యద్ సమీర్‌లు పట్టుబడగా అహ్మద్ పటాన్ పరారీలో ఉన్నాడని తెలిపారు. సత్యం, సమీర్‌లను విచారించగా హైవే రోడ్లలో ఉన్న ఊర్లను, గుళ్లను పరిశీలించి అందులో విలువైన వస్తువులను దొంగలించామని తెలిపారు. ఇదే ముఠా గత నెల 19న రామాయంపేట పోలీసుస్టేషన్ పరిధిలో మల్లన్నగుడిలో, సదాశివనగర్ మండలంలోని ఎల్లమ్మగుడిలో దొంగతనం చేశారని తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. వారి వద్ద రెండు మొబైల్ ఫోన్లు, ఒక్క ఆటో, మూడు జతల అమ్మ వారి కండ్లు, రూ.5వేలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ చైతన్యారెడ్డి, భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, సీసీఎస్ ఎస్సై ఉస్మాన్, భిక్కనూర్ ఏఎస్సై వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్ ద్వారా 157 మొబైల్ ఫోన్ల రికవరీ

సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు (మిగతా 8వ పేజీలో)

లింగంపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని చారిత్రక కట్టడం నాగన్న బావి వద్ద డీఆర్‌డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఐకేపీ మహిళా సంఘాల మహిళలు బతుకమ్మ పండుగను నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలను తీసుకువచ్చి బతుకమ్మ పాటలతో, ఆటలతో ఘనంగా నిర్వహించారు.

తాడ్వాయి: మండల కేంద్రంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలను ఆట పాటలతో ఆనందోత్సాహాల మధ్య మహిళలు నిర్వహిస్తున్నారు. బతుకమ్మలో నాలుగవ రోజు బతుకమ్మను ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నారులు సైతం బతుకమ్మలు ఆడారు.

భిక్కనూరు: మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయం వద్ద శుక్రవారం సమాఖ్య ఆధ్వర్యంలో పెద్దఎత్తున బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య సభ్యులు తీరొక్క పూలను సేకరించి వాటితో అందంగా బతుకమ్మలను పేర్చి సమాఖ్య కార్యాలయం ఎదుట వాటిని పెట్టి బతుకమ్మ పాటలు పాడుతూ సభ్యులు, సిబ్బంది బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఏపీఎం సాయిలు, సమాఖ్య అధ్యక్షురాలు రాజమణి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగ అని అన్నారు. ఈ మేరకు ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

గాంధారి: గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం పూల తేరులతో ముస్తాబు చేసి సంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబించేలా కళాత్మకంగా అలంకరించబడిన బతుకమ్మలకు ప్రిన్సిపాల్ గంగారాం పూజలు చేసి కార్యక్రమాన్ని (మిగతా 8వ పేజీలో)

రామ రామ రామ ఉయ్యాలో..



నాగన్న బావి వద్ద బతుకమ్మలతో మహిళలు

సీనియార్టీ ప్రకారం ఎన్నికల బాధ్యతలు అప్పగించాలి

సదాశివనగర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉపాధ్యాయులకు సీనియార్టీ ప్రాతిపదికన విధులు కేటాయించకుండా సీనియర్ ఉపాధ్యాయులకు అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారి, జూనియర్ ఉపాధ్యాయులకు ప్రిసైడింగ్ అధికారి విధులు కేటాయించుట సరైనా పద్ధతి కాదని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతల లింగం, బీసీటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. (మిగతా 8వ పేజీలో)

ఘనంగా కుంకుమ పూజలు



కామారెడ్డిలోని శారదాదేవి ఆలయం వద్ద కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కామారెడ్డిరూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో శుక్రవారం దేవి నవరాత్రుల సందర్భంగా కుంకుమార్చనలు నిర్వహించారు. శారదాదేవి ఆలయంలో సహస్ర కుంకుమార్చన, నవదుర్గవ్రతం, (మిగతా 8వ పేజీలో)

యాదిలో..



9 రోజులు పండగ చేసుకునేటోళ్లం

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను 9 రోజుల పాటు ఘనంగా చేసుకునే వాళ్లం. ఆనాడు డీజేలు లేవు.. ఆడోళ్లం అందరం కలిసి పాటలు పడుకునే వాళ్లం. మా అన్నదమ్ములు రంగు రంగుల పూలు తెచ్చేటోళ్లు. వాటితో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సంబరాలు జరుపుకునేవాళ్లం. తర్వాత చక్కి చెరువులో డప్పుచప్పుల మధ్య నిమజ్జనం చేసేవాళ్లం. అప్పటి బతుకమ్మ పండుగ మజానే వేరుగా ఉండేది.

- శాంతాబాయి, బోధన్



మేమే పాటలు పాడేటోళ్లం..

60 ఏళ్ల క్రితం పూల కోసం అడవిలోకి ఉదయం వెళ్లి పూలను తీసుకువచ్చేవాళ్లం. తెచ్చిన పూలను అందరం కలిసి బీడీల కంపెనీ దగ్గర బతుకమ్మని తయారు చేసేవాళ్లం. సాయంత్రం 4 గంటల సమయంలో బతుకమ్మను ఆడేవాళ్లం. వెంట సద్ది అన్నం తీసుకువెళ్లి బతుకమ్మ నిమజ్జనం చేసిన తరువాత అక్కడ తినేవాళ్లం. అప్పుడు డీజేలు లేవు. బతుకమ్మ బతుకమ్మ బగ్గుమనే.. బగ్గుమన్న దగ్గర జగ్గుమనే అంటూ పాటలు పాడుకునేవాళ్లం.

- గడ్డం నర్సవ్వ, గాదేపల్లి, డొంకేశ్వర్ మండలం



చేతి చప్పుళ్లతో పాడుతూ ఆడుతుంటిమి..

అప్పట్లో బతుకమ్మ పండుగ వచ్చిందంటే మా ఊరితో పాటు వాడ వాడల కళ ఉట్టిపడేది. రోజుకో రంగు పువ్వులతో బతుకమ్మను పేర్చేవాళ్లం. తెలంగాణ బతుకమ్మ పాటలు చేతి చప్పుళ్లతో పాడుకుంటూ తొమ్మిది రోజుల పాటు పండగ జరుపుకునేవాళ్లం. పీట బొడ్డెమ్మ, గుంట బొడ్డెమ్మ, పందిరి బొడ్డెమ్మ, బాయి బొడ్డెమ్మలు తయారు చేసి ఆహ్లాదరకంగా ఘనంగా ఆడిపాడేటోళ్లం. ఇప్పుడంతా డీజే పాటలకు ఎగురుతున్నరు. మా అప్పుడే మంచిగుండే.

- మాసం లక్ష్మి ఏర్గట్ల



క్రైం సమాచారం

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



బాల్‌రాజు(ఫైల్)

కామారెడ్డిరూరల్,సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్గుల్‌కు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కాట్లే బాల్‌రాజు(45) మృతిచెందాడు. కొన్ని నెలలుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురై మరణించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఆయన అందించిన సేవలను గ్రామస్థులు గుర్తు చేసుకున్నారు.

టేకు చెట్ల దొంగతనం

దోమకొండ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దోమకొండ శివారులోని ఓ పొలం వద్ద 5టేకుచెట్లు దొంగతనానికి గురయ్యాయి. దోమకొండకు చెందిన పున్న లక్ష్మణ్ అనే రైతు పొలం వద్ద పెంచుతున్న టేకుచెట్లను గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డళ్లతో నరుక్కుని తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఈ విషయం బాధిత రైతు లక్ష్మణ్ ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

ఆత్మహత్యాయత్నం.. కాపాడిన తహసీల్దార్

నవీపేట,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ గోదావరిలో దూకబోతున్న వ్యక్తిని శుక్రవారం తహసీల్దార్ వెంకటరమణ కాపాడి పోలీసులకు అప్పగించారు. నిర్మల్ జిల్లా కుంటాల మండలం లింబాకు చెందిన అలకుంట మహేష్ కుటుంబ సభ్యులతో గొడవపడి యంచ గోదావరి బ్రిడ్జి వద్దకు చేరుకున్నాడు. నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని భావించిన యువకుడు బ్రిడ్జి వద్దకు చేరుకోగా బాసర నుంచి నవీపేట వస్తున్న తహసీల్దార్ వెంకటరమణ యువకుడిని కాపాడి తన కారులో నవీపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అతడి కుటుంబీకులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవునిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని బీడీ వర్కర్స్ కాలనీకి చెందిన రాపత్య మారుతి(75) చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై రంజిత్ తెలిపారు. ఈ నెల 24న ఇంటి ముందర కాలు జారిపడగా.. తలకు తీవ్రగాయమైంది. మెరుగైన చికిత్స కోసం కుటుంబీకులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మరణించినట్లు ఎస్సై వివరించారు.

ఆర్థిక మోసం.. ఇద్దరికి రిమాండ్

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటుకల తయారీ కోసం కూలీలను పంపిస్తామని మోసం చేసిన నలుగురిపై కేసు నమోదు చేసి, ఇద్దరినీ శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని గోపాల్‌పేట్‌కు చెందిన నాదెండ్ల వెంకట్‌రావు వద్ద నుంచి ఒడిశాకు చెందిన నలుగురు సాంబా, లింగం, కలియా, పూరణ్‌లు ఇటుక తయారీ కోసం కూలీలను పంపిస్తామన్నారు. ఇందుకు వెంకట్‌రావు నుంచి నవంబర్ 2024లో రూ.7,22,900 తీసుకొని కూలీలను పంపించకుండా మోసం చేశారు. వెంకట్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేషశారు. నిందితులు ఆసిఫాబాద్ జిల్లాలో ఉన్నారని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి సాంబా, కలియాలను పట్టుకున్నారు. వారిద్దరిని రిమాండ్‌కు తరలించారు.

శాస్త్రీయ నృత్య పోటీలకు శ్రీవల్లి ఎంపిక



మలేషియా నృత్య పోటీలకు ఎంపికైన వేల్పూర్ శ్రీవల్లి

వేల్పూర్, సెప్టెంబరు, 26(ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి వేల్పూర్ సొసైటీ ఆధ్వర్యంలో మలేషియాలో నిర్వహించనున్న బతుకమ్మ, దసరా సంబురాలలో భాగంగా శాస్త్రీయ నృత్య పోటీలకు వేల్పూర్‌కు చెందిన కోమన్‌పల్లి శ్రీవల్లి ఎంపికైంది. మలేషియాలో ఈనెల 28న నిర్వహించనున్న శాస్త్రీయ నృత్య పోటీలలో శ్రీవల్లి పాల్గొననుందని ఆర్మూర్ నటరాజ నృత్యానికేతన్ గురువు డాక్టర్ మృణాలిని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న శ్రీవల్లి మలేషియా నృత్య పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆమె తల్లిదండ్రులు జైపాల్, రాధిక ఆనందం వ్యక్తం చేశారు.

ఆలూర్‌లో వినయ్‌రెడ్డి చాయిపే చర్చ



కార్యకర్తలతో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

ఆలూర్, సెప్టెంబరు, 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి చాయిపే చర్చ నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడం ద్వారా ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలోనే పల్లెల అభివృద్ధి, ప్రజల సంక్షేమం జరుగుతుందని తెలిపారు. ఆలూర్ మండలానికి ప్రత్యేక ప్రాధన్యతనిస్తూ ప్రతీ గ్రామ సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సాయిబాబాగౌడ్, పండిత్ పవన్, విజయ్, ఉదయ్, ముత్యంరెడ్డి, సంజీవ్, శ్రీనివాస్, చిరంజీవి, కిషన్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ రైతుకు సన్మానం

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): ఉప్లూర్‌కు చెందిన బోనగిరి భాస్కర్‌ను జిల్లా ఉత్తమ రైతుగా అవార్డు వరించడంతో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవి ప్రవీణ్, శ్రీనివాస్, దేవేందర్, బుచ్చన్న తదితరులున్నారు.

అమరుల స్ఫూర్తి.. చైతన్య దీప్తి

- ఉద్యమకారుల స్మారకార్థం స్తూపం నిర్మాణం
- 47 అడుగులతో ఆసియాలోనే అతిపెద్దదిగా గుర్తింపు



మానాలలో మహిళల స్మారక స్తూపం

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 26: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం మానాలలో పీపుల్స్‌వార్ ఉద్యమానికి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచిన తొలి మహిళా అమరుల స్మారక స్తూపం ఆవిష్కరించి నేటికి 28 వసంతాలు పూర్తయ్యాయి. బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని(ప్రస్తు రాజన్న సిరిసిల్లా జిల్లా రుద్రంగి మండలం) 1997లో ఉత్తర తెలంగాణ మహిళా జోనల్ కమిటి తొలి సమావేశం జరిగింది. ఈ సమయంలో వార్ కేంద్ర కమిటీ మహిళ శిక్షణ తరగతులు నిర్వహించింది. ఉత్తర తెలంగాణలో ఉద్యమంలో ఉండి ప్రాణాలు కోల్పోయిన 20మంది ఉద్యమకారిణులను స్మరిస్తూ మానాలలో స్మారక స్తూపం నిర్మించాలని కమిటీ తీర్మానించింది. ప్రజలే చరిత్ర నిర్మాతలని చెప్పిన మావో సూక్తిని ఆచరణలో తెస్తూ నిర్మాణానికి నడుంబిగించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో కలిసి నిధులు సేకరించారు. మానాలకు చేరుకునే ప్రతి రహదారిని 6కి.మీ దూరం వరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పాటు రక్షణ కంచెలు ఏర్పాటుచేసి పనులు ప్రారంభించారు. పగలు రాత్రి మొత్తం కలిపి రోజూ స్తూపం నిర్మాణంలో ఇంటికొకరు చొప్పున స్వచ్ఛందంగా రోజుకు 50-60 మంది కూలీలుగా తమవంతు సేవలందించారు. కేవలం 10 రోజుల్లో ఆసియాలోనే అతిపెద్దదైన పీపుల్స్ వార్ మహిళా స్మారక స్తూపం పూర్తయింది. దీని ఎత్తు 45అడుగులు కాగా.. దానిపైన మరో 2అడుగుల సుత్తి కొడవలి, మొత్తం 47 అడుగుల స్తూపాన్ని నిర్మించారు. నిర్మాణ సమయంలో గ్రామస్థులెవరూ బయటికి వెళ్లకుండా.. బయటి వారు లోపలికి రాకుండా చర్యలు తీసుకున్నారు. 1997 సెప్టెంబర్ 26 నాటికి నిర్మాణం పూర్తికాగా మరుసటి రోజునే ఆవిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామాల ప్రజలు, వార్ సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో హాజరు కాగా విప్లవకవి వరవరరావు, రైతు కూలీ సంఘం, కేంద్ర కమిటీ సభ్యులు, వివిధ ప్రాం తాలకు చెందిన 18పీపుల్స్‌వార్ దళాలు పాల్గొన్నాయి. ఆవిష్కరణ అనంతరం అమరుల త్యాగాలను స్మరిస్తూ విప్లవ గీతాలు ఆలపించి, సహపంక్తి భోజనాలు చేశారు. నాటి నుంచి నేటి వరకు ఈ స్తూపం చెక్కు చెదరకుండా సజీవసాక్షంగా నిలుస్తోంది.

యువత స్టేడియాన్ని వినియోగించుకోవాలి



ఇండోర్ స్టేడియం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్,సెప్టెంబరు,26(ఆంధ్రజ్యోతి): వేల్పూర్‌లో ఏర్పాటుచేసిన ఇండోర్ స్టేడియాన్ని యువత ఉపయోగించుకో వాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మినీ స్టేడి యంలో ఇండోర్ స్టేడియాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. క్రీడలు ఆడడం, జిమ్ చేయడంతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారన్నారు. మినీ స్టేడియంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఇం డోర్ స్టేడియాన్ని నిర్మించామన్నారు. అందులో ఉడెన్ ఫ్లోరింగ్ కోసం షెటిల్, కబడ్డీ కోర్టులను ఏర్పాటు చేసుకోవడం, మరమ్మతుల కోసం గతేడాది ఎంపీ సంతోష్ కుమార్‌ను అడిగిన వెంటనే రూ.35 లక్షలు మంజూరు చేశారన్నారు. వేల్పూర్ హైస్కూల్ అదనపు గదుల నిర్మాణానికి రూ.25లక్షలు, ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి రూ.1.03 కోట్లు, ముదిరాజ్ సంఘ భవనానికి రూ.20లక్షలు, క్రిస్టియన్ చర్చి కంపౌడ్‌వాల్‌కు రూ.5 లక్షలు ఎంపీ ఇచ్చారన్నారు. ప్రజల తరపున ఎంపీ సంతోష్‌కి ధన్యవాదాలు తెలిపారు.

ఐలమ్మకు ఎమ్మెల్యే నివాళి..

వేల్పూర్‌లో చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఐలమ్మ జీవితం అందరికి స్ఫూర్తిదాయమైనదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నాగధర్‌రెడ్డి తదితరులున్నారు.

గుర్తింపు తెచ్చుకోవాలి



సన్మానిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

భీమ్‌గల్, సెప్టెంబరు, 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ పర్వంలో పదవీ విరమణ సహజమని, ప్రతీ ఉద్యోగి పనిచేసే చోట మంచి గుర్తింపు పొందాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి పేర్కొన్నారు. గ్రంథాలయంలో పనిచేస్తున్న వంగ గంగాధర్‌గౌడ్ పదవీవిరమణ చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వృత్తి ధర్మంలో ఆటుపోట్లు ఎదుర్కొని, పనిచేసే చోట మంచి గుర్తింపు పొందినవారు పదవీ విరమణ చేపట్టిన అనంతరం ప్రజల గుండెల్లో నిలిచిపోతారని చెప్పారు. అనంతరం గంగాధర్ గౌడ్ దంపతులను జిల్లా కార్యదర్శి బుగ్గారెడ్డితో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నరేషరెడ్డి, జిల్లా లైబ్రరియన్ కిషన్, తారకం, నర్సయ్య, జూనియర్ అసిస్టెంట్ రాజేశ్వర్, శ్రీకాంత్, శ్రావణ్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ మూర్ఖుడు: బోధన్ ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): కేటీఆర్‌లాంటి మూర్ఖులను తెలంగాణ ప్రజలు ఎప్పటికి రాజకీయాలకు దూరంగా పెట్టాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ హయంలో యువతకు ఎలాంటి ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించాలనే ఉద్దేశంతో గ్రూప్1 పరీక్షలు నిర్వహించిందన్నారు. ఆటో, రిక్షా, హోటల్‌లో పనిచేసే, ఇతరుల పిల్లలు ఉద్యోగాలు సాధించారన్నారు. ఇలాంటి నిరుపేద విద్యార్థుల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కరి వద్ద రూ.3కోట్లు తీసుకొని ఉద్యోగాలు కల్పించిందని ఆరోపణలు చేసిన కేటీఆర్‌పై సుదర్శన్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు రైస్ కుక్కర్ల పంపిణీ చేశారు. వర్షాలకు ఖండ్‌గావ్, హంగర్గ, కొప్పర్గ తదితర గ్రామాలలో వర్షాలకు దెబ్బతిన్న ప్రభుత్వ పాఠశాలల సౌకర్యార్థం బెంచీలను అందజేశారు. ఇటీవల పరీక్షల్లో ఉత్తీర్ణులైన స్వామి కుమారుడు ప్రణయ్‌సాయికి లాప్‌టాప్‌ను అందజేశారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఆసుపత్రి పరిసరాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఐసీడీఎస్ సీడీపీవో పద్మజ, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు బసవేశ్వర్ రావు, నరసింహరెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, నాగేశ్వర్‌రావు, లయన్స్ లక్ష్మి బసవేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి శంకుస్థాపన

సాలూర, నవీపేట, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): సాలూర మండలం జాడిజమాల్‌పూర్‌లో, నవీపేట మండలం హనుమాన్‌ఫారంలో 33/11కేవీ విద్యుత్ నూతన ఉప కేంద్రాల నిర్మాణానికి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. రైతులు పామాయిల్ సాగు చేయడానికి మొగ్గు చూపాలని, పంటల మార్పిడిపై దృష్టి పెడితేనే లాభాలను పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమాల్లో ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్, డీఈ శ్రీనివాస్, ఏడీఈ ప్రశాంత్ రెడ్డి, ఏఈలు ఆనంద్ కుమార్, శ్రీనివాస్, నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ రాంచందర్ ఉన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



కేంద్రీయ విద్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న బోధన్ సబ్ కలెక్టర్

బోధన్,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యాసం పట్ల వ్యూహరూపకల్పన చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం కేంద్రీయ విద్యాలయం మేనేజ్‌మెంట్ కమిటీతో సమీక్ష నిర్వహించారు. విద్యాలయ కార్యకలాపాలు, అభివృద్ధి అంశాలపై సమీక్షించారు. విద్యాభ్యాసం పట్ల, ఉత్తీర్ణత పట్ల రూపకల్పన చేసి విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా చూడాలన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సర ప్రవేశ స్థితి, ప్రవేశ ప్రక్రియలు సాఫీగా జరగడానికి తీసుకున్న చర్యలపై ప్రశ్నించారు. పీఎంశ్రీ స్కీం కింద పాఠశాల అభివృద్ధికి నిధుల కేటాయింపుపై సమీక్షించారు. కార్యక్రమంలో బోధన్ ఎంఈవో నాగయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో .సమత, విద్యాలయ ఉపాధ్యాయబృందం పాల్గొంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బోధన్,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మంజీర పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. పరివాహకంలోని రెంజల్, సాలూర, పోతంగల్ మండలాల ప్రజలు నీటివైపు వెళ్లొద్దని, సురక్షితంగా ఉండాలని సూచించారు.

రాష్ట్రస్థాయికి కల్లెడ విద్యార్థులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

ఆలూర్, సెప్టెంబరు,26 (ఆంధ్రజ్యోతి): కల్లెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హర్షవర్ధన్, దీప్తి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 17వ తేదీన హైదరాబాద్‌లో తెలంగాణ హ్యాండ్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన మినీ హ్యాండ్‌బాల్ సెలక్షన్స్‌లో మంచి ప్రతిభ కనబర్చినట్లు ప్రధానోపాధ్యాయుడు నాగరాజు తెలిపారు. బాలుర విభాగంలో హర్షవర్ధన్, బాలికల విభాగంలో దీప్తి ఎంపికయ్యారని, వీరు తెలంగాణ రాష్ట్రహ్యాండ్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26-29 వరకు హైదరాబాద్‌లోని నిజాం కాలేజ్ గ్రౌండ్‌లో జరిగే పోటీలో పాల్గొంటారన్నారు. వీరి ఎంపికకు కృషి చేసిన పీడీ సురేందర్‌ను ప్రధానోపాధ్యాయుడు నాగరాజు అభినందించారు.

సబ్ జూనియర్ పోటీలకు రాహుల్

ముప్కాల్, సెప్టెంబరు, 26(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ సేయింట్ ఎలిజబేత్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రాహుల్ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సుందరి తెలిపారు. ముప్కాల్‌లో ఈనెల 25 నుంచి 28వరకు జరుగుతున్న పోటీల్లో 35వ సబ్ జూనియర్ పోటీలకు నిజామాబాద్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. హెచ్ఎం, వ్యాయమ ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌ను అభినందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మోస్రా,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజశేఖర్ సూచించారు. వాగులు, చెరువులు, లోతట్టు ప్రాంతాల వద్దకు, జలపాతాల వద్దకు వెళ్లవద్దని పేర్కొన్నారు. శిథిల ఇళ్లను ఖాళీచేసి పునరావాస కేంద్రాలకు వెళ్లాలన్నారు.



డొంకేశ్వర్‌లో..



నవీపేట తడగామ కాలనీలో..



నవీపేట దుర్గామాత మందిరంలో కరెన్సీ నోట్లతో అలంకరించిన దృశ్యం

అపురూపం.. మహాలక్ష్మీ అవతారం

దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా జిల్లావ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు రోజూ ఓ రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. శుక్రవారం లక్ష్మీదేవీ అవతారంలో భక్తులకు కనిపించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కరెన్సీ నోట్లతో మండపాలను అలంకరించారు. డొంకేశ్వర్ మండలంలోని సత్య గంగవ్వ కళ్యాణ మండపంలోరూ.21,11,11తో, నవీపేటలోని తడగామ కాలనీలో రూ.7.21లక్షలు, భక్తమార్కండేయ మందిరం ఆవరణలో కరెన్సీ నోట్లతో అలంకరించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

రోడ్డు నిర్మించాలి

రుద్రూరు,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి):మండలంలోని జేపీఎస్ కాలనీలోని 13వ వార్డులో సీసీ రోడ్డు నిర్మించాలని శుక్రవారం కాలనీవాసులు ఆందోళన చేశారు. వర్షాలకు బురదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, డ్రైనేజీలు, వీధి దీపాలు కూడా లేవని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలన్నారు.

కొనుగోళ్లకు సిద్ధమవ్వాలి

బోధన్,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలని, అందుకు కావాల్సిన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా సహకార సంఘాల అధికారి శ్రీనివాస్ రావు అన్నారు. శుక్రవారం బోధన్ డివిజన్‌లో సహకార సంఘాల సన్నాహక సమావేశం నిర్వహించారు. డివిజన్ స్థాయి కార్యదర్శులు, ఆపరేటర్లకు వరి కొనుగోలుపై ఓపీఎంఎస్ పద్ధతిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏడీఏ మహ్మద్ అలీ, బోధన్, నవీపేట క్లస్టర్ అధికారులు రవీందర్, రమావతి, సివిల్ సప్లై టెక్నికల్ అధికారి నరేందర్, ఏవోలు, సహకార సంఘాల మానిటర్నింగ్ అధికారులు అరుణ్, అశోక్, అలీం ఉన్నారు.

వర్నిలో వైద్య శిబిరం

వర్ని, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వస్ నారీ.. స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా వర్నిలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, స్నేహ, పద్మజ, ఉమా, శ్రీకాంత్, చిన్న పిల్లలకి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

పన్నులు చెల్లించాలి



పన్నులు వసూలు చేస్తున్న దృశ్యం

బోధన్,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని వ్యాపారస్థులు పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని బోధన్ క్లబ్ వారు 100813 రూపాయల పన్ను బకాయిలను చెల్లించడం జరిగిందన్నారు. ఇలాగే ప్రతి ఒక్కరు పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు తదితరులున్నారు.

సర్కారులో నాణ్యమైన విద్య

మోర్తాడ్, సెప్టెంబరు, 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ప్రిన్సిపాల్ గంగాధర్ తెలియజేశారు. శుక్రవారం కళాశాలలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడారు. తమ కళాశాలలో అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నారని, నాణ్యమైన విద్యాను అందిస్తున్నామని తెలిపారు. అంతేకాక యోగా, ధ్యానం వంటి అనేక కార్యక్రమాలను నేర్పిస్తున్నామని పేర్కొన్నారు. కళాశాల మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షలో ఉందని, మీ పిల్లలను.. తమ పిల్లలుగా భావించి కాపాడుకుంటామని తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. ఎలాంటి భయం లేకుండా ఉం డాలని అంతాతాము చూసుకుంటామని చె ప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐలమ్మ త్యాగం.. స్ఫూర్తిదాయకం



డొంకేశ్వర్ చాకలి ఐలమ్మకు నివాళులు అర్పిస్తున్న నాయకులు, స్థానికులు

ఆర్మూర్, సెప్టెంబరు, 26(ఆంధ్రజ్యోతి): నేటి తరానికి చాకలి ఐలమ్మ త్యాగం ఎంతో ఎంతో స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. ఆమె జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా శుక్రవారం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె పోరాటం వెలకట్టలేనిదని ఆమె ధైర్యసాహసాలే నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



మెండోరాలో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



ఏర్గట్లలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు



అర్గుల్‌లో కేక్‌కట్ చేస్తున్న గోర్త రాజేందర్

ఘనంగా ఈరవత్రి అనిల్ జన్మదిన వేడుకలు

బాల్కొండ నియోజకవర్గవ్యాప్తంగా రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి, టపాసులు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. మెండోరాలో నిర్వహించిన కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ సోంరాజేందర్, పార్టీ అధ్యక్షుడు రవి, మిట్టపల్లి సాయిరాం, నరేష్, రాజారెడ్డి, రమేష్, గంగారెడ్డి, రాజన్న, శ్రీనివాస్, నవీన్, ముత్యం, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు. ఏర్గట్లలో మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, జిల్లా జనరల్ సెక్రెటరీ రవి, శ్రీనివాస్, మునీర్, శ్రీనివాస్ గౌడ్ వేడుకలు నిర్వహించారు. అలాగే తాళ్లరాంపూర్‌లో బ్లాక్ కాంగ్రెస్ బాల్కొండ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్, మండల అధ్యక్షుడు సోమ దేవరెడ్డి పాల్గొన్నారు. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లో మాజీ సర్పంచ్‌ల ఫోరం జిల్లాధ్యక్షుడు గోర్త రాజేందర్ ఆధ్వర్యంలో వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకుడు సదానంద్, రజక సంఘం సభ్యులు సాగర్, గంగాధర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

యాదిలో..



ఆనాటి బతుకమ్మ వైభవం ఇప్పుడు లేదు

- సుతారి పోశవ్వ, కామారెడ్డి

నా చిన్నతనంలో బతుకమ్మ పండుగ అంటే ఎంతో మురిసిపోయేవాళ్లము. అప్పట్లో చిన్నతనంలోనే వివాహాలు జరిగేవి. చుట్టుపక్కల వారితో కలిసి బతుకమ్మలను సంబరంగా ఆడుకునేవాళ్లం. ఎవరైన ఒక్కరు బతుకమ్మ పాట పాడుతుంటే వాళ్లను అనుకరించి గంటలకొద్ది బతుకమ్మ పాటలు పడుతూ ఆటలు ఆడేవారం. బతుకమ్మ నిమజ్జానికి కుంటలు, కాల్వలు, చెరువుల వద్దకు వెళ్లేవారము. ఇప్పుడు పట్టుమని 10 నిమిషాలు బతుకమ్మను ఆడడం లేదు.



గ్రామాల్లో బతుకమ్మ వైభవం తగ్గిపోతుంది.

- గడ్డమీది రాజవ్వ, అడ్లూర్ గ్రామం

మా చిన్నతనంలో బతుకమ్మ పండగను వైభవంగా నిర్వహించుకునేవాళ్లం. పంట పొలాల్లోకి వెళ్లి గునుపువ్వు, తంగేడు పువ్వు, గుమ్మడి ఆకు, బెల్లం పువ్వు తెచ్చి బతుకమ్మలను అందంగా తయారు చేసే వాళ్లము. బతుకమ్మలను ప్రధాన వీదుల వద్ద పెట్టి ఊరంత సంబరాలు చేసుకునేవాళ్లము. ప్రస్తుతం గ్రామాల్లో నాటి వైభవం తగ్గిపోతుంది. తొమ్మిది రోజుల పాటు గంటలకొద్ది బతుకమ్మ ఆడి చెరువుల్లో, కుంటల్లో నిమజ్జనం చేసేవాళ్లం.



- బతుకమ్మ పండుగ అంటే సంబరమే

- లక్ష్మీ, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, కామారెడ్డి

బతుకును ఇచ్చేది బతుకమ్మ పండుగ అని మా పెద్దలు చెబుతుండే వారు. బతుకమ్మ పండుగ విశిష్ఠత తెలియని వయస్సు నుంచే పెద్దలతో కలిసి బతుకమ్మ ఆడేవాళ్లము. పెళ్లి అయిన తర్వాత అత్తింటి వద్ద ఉన్న చుట్టు పక్కల వారితో మమేకమవుతూ బతుకమ్మ పండుగను సంబరంగా జరుపుకునే వారిమి. మున్సిపల్ చైర్ పర్సన్‌గా చేసిన సమయంలో బతుకమ్మ పండగను వైభవంగా నిర్వహించునేవాళ్లము.





ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

పీవోలకు, ఏపీవోలకు శిక్షణ

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన స్థానిక సంస్థల ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు గాను అధికారులు మండల కేంద్రంలోని రైతు వేదికలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి ఎంపిడివో లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సిద్దంగా ఉన్నామని, ఇందు కోసం పీవో,ఏపీవోలకు శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు.

ప్రిసైడింగ్ అధికారులకు..



బీర్కూర్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం

బీర్కూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం 2025 గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 2025 గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై అధికారులకుపై అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అనీల్‌కుమార్, ఎంపీడీవో మహబూబ్ పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు అడ్వకేట్ హాలులో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్లు తెలిపారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ హై కోర్టు న్యాయమూర్తి నర్సింగ్‌రావు నందికొండ రక్తదాన శిబిరం ప్రారంభిచనున్నట్లు వారు తెలిపారు. రక్తదానం చేసిన వారికి అభినందన పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌లలోని వాలంటీర్లు , విద్యార్థులు , యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదాన శిబిరంను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంతోష్ , రామకృష్ణారెడ్డి తదితరులున్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటలకు

నష్టపరిహారం విడుదల చేయాలి

ఎల్లారెడ్డి, సెప్టెం బరు 26 (ఆంధ్ర జ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరాకు 50 వేల నష్టపరిహారం రైతులకు అందించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి శుక్రవారం ఆర్డీవో పార్థ సింహారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి కామారెడ్డి ప్రధాన రహదారి వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని, రోడ్లపై గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు ఆయనతో పాటు బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింలు, పట్టణ అధ్యక్షుడు రాజేష్, నాయకులు బాలకిషన్, శంకర్, ఆకుల కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చాకలి ఐలమ్మకు ఘన నివాళి



మద్నూర్‌లో చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలు



బరంగ్ ఏడ్గిలో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

మద్నూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ 130వ వేడుకలను రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం రజక సంఘం గల్లీలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజలు రజక సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం రజక సంఘం మండల అధ్యక్షులు దేవిదాస్ మాట్లాడుతూ తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పి మహిళ లోకానికి స్పూర్తినిచ్చిన దీరవనిత అని గుర్తు చేశారు. వీరనారి చాకలి ఐలమ్మను ప్రతి ఒక్క రూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాములు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బరంగ్ ఏడ్గిలో ..

బీర్కూర్: మండలంలోని బరంగ్ ఏడ్గి గ్రామంలో శుక్రవారం వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆమె ఘనతను గుర్తుచేసుకుని జోహార్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చాకలి కులస్థులు చాకలి నాగయ్య, నాగు, గ్రామపెద్దలు, ఏఎంసీ డైరెక్టర్ రాజు, శ్రీనివా

ఎల్లారెడ్డి: పట్టణ కేంద్రంలో చాకలి ఐలమ్మ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం రజక సంఘం మండల అధ్యక్షుడు సాయి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయిధ పోరాటంలో పెత్తందారు అణచివేతను వ్యతిరేకిస్తూ మానవత్వం కోసం పోరాడిన మహా గొప్ప మహనీయురాలని సమాజానికి ఆమె సేవలను గుర్తు చేశారు. నేటి తరానికి ఆమె ఒక మార్గదర్శకమని తెలిపారు వారితో పాటు రజక సంఘం సభ్యులు సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, విద్యాసాగర్, మహేష్ పాల్గొన్నారు. అనంతరం బిజెపి రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరానికి ఐలమ్మ జీవితం ఒక మార్గదర్శకత్వం ఆయన అన్నారు. ఆయనతో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పంటలను ముంచేసిన మంజీరా

● ఆందోళన చెందుతున్న అన్నదాతలు



నాగిరెడ్డిపేటలో మంజీరా వరద నీటితో మునిగిన వరి పంట పొలాలు

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలోని వరి పంట పొలాలను మంజీరా వరద నీరు మళ్లీ ముంచేసింది. మండలంలోని మంజీరా నది పరివాహక ప్రాంతానికి చెందిన వివిధ గ్రామల శివారులోని పంట పొలాలను మంజీరా వరద నీరు మళ్లీ ముంచేసింది. సింగూరు ప్రాజెక్టు ద్వారా నీటిని భారీ స్థాయిలో దిగువకు నిజాం సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తుండటంతో మంజీరా నది మళ్ళీ ఉప్పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నందునందున, ఈ వరద ఉధృతికి వరద నీరు పంట పొలాల్లోకి చేరి పంటలను ముంచేస్తుంది. సుమారు నెల రోజుల వ్యవధిలో ఇదివరకే రెండుసార్లు మండలంలోని వివిధ గ్రామాల్లో మంజీరా వరద నది నీటి వల్ల పంటలన్నీ నీట మునగగా, వర్షాలు తగ్గు ముఖం పట్టడంతో నీట మునిగిన పంట పొలాలు నీటి నుంచి తేలుతున్న క్రమంలో మళ్లీ సింగూరు జలాలు భారీ స్థాయిలో దిగువకు విడుదల చేస్తుండడంతో మంజీరా నీటి వల్ల మండలంలోని పంట పొలాల్లో మళ్లీ నీట మునిగాయి. మంజీరా నదిలో పేరుకుపోయిన పూడిక కారణంగా, తుమ్మ చెట్లు పెరిగిపోవడం కారణంగా నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడడంతో వరద నీరు మంజీరా నది నుంచి సుమారు రెండు కిలో మీటర్ల మేరకు వ్యాపించడంతో మండలంలోని వివిధ గ్రామాల్లోని నిలువు వరి పంటలు మంజీరా నీటితో ముంపునకు గురవుతున్నాయి.

మచ్చలేని మహా నాయకుడు.. పోచారం

- వలస నేతల్లారా ఖబడ్దార్
- భాస్కర్‌రెడ్డికి వెన్నుపోటు పొడిచిన ఘనత వేములదే
- బాజిరెడ్డి ప్రజలను రెచ్చగొట్టే మనిషి
- ధ్వజమెత్తిన సొసైటీ చైర్మెన్ ఎర్వల కృష్ణారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మా నాయకుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి మచ్చలేని మహానాయకుడని, శ్రీరామచంద్రుడు లాంటి వాడని బాన్సువాడ సొసైటీ చైర్మెన్ ఎర్వల కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పోచారం నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకుల బతుకమ్మ సంబరాల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరు రాముడో, ఎవరు రావణుడో తెలుస్తుందన్నారు. అప్పటి డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డికి వెన్నుపోటు పొడిచిన ఘనత వేముల ప్రశాంత్‌రెడ్డిదేనని ధ్వజమెత్తారు. ఉన్న ఊర్లో మాటలు చెప్పి సర్దుబాటు చేయడం చేతకాని నాయకులు బాన్సువాడలో చెప్పడానికి వస్తున్నారని ఎద్దేవా చేశారు. 2018లో రైతులకు ఎన్ని బ్యాంకుల్లో ఖాతాలున్నా రుణమాఫీ చేయించిన ఘనత పోచారందేనన్నారు. అదే 2023లో రుణమాఫీ గురించి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి వివరించినా సీఎం దగ్గర చెప్పి రుణమాఫీ చేయించలేదని మండిపడ్డారు. ఒక్క ఎమ్మెల్యే దగ్గరికి 10 మంది బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు వస్తున్నారంటే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కెపాసిటీ ప్రజలకు తెలుసన్నారు. కేవలం బాన్సువాడ నియోజకవర్గం , ప్రజల సంక్షేమం కోసం సీఎం అండ తీసుకోవడం తప్పా అని బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని, లేని పక్షంలో మూల్యం చెల్లించకతప్పదని తీవ్రంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మెన్ గురువినయ్ , మోహన్‌నాయక్, నార్ల సురేశ్ , ఏజాస్ , దాసరి శ్రీనివాస్ , పిట్ల శ్రీధర్ , నర్సన్నచారీ తదితరులున్నారు.

బాజిరెడ్డి ప్రజలను రెచ్చగొట్టే నాయకుడు

- మాజీ ఏఎంసీ చైర్మెన్ గురువినయ్

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రజలను రెచ్చగొట్టే నెంబర్ వన్ నాయకుడని మాజీ ఏఎంసీ చైర్మెన్ గురువినయ్ మండిపడ్డారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై బాజిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. 2004లో బాజిరెడ్డి బాన్సువాడలో ఎమ్మెల్యేగా గెలిపిస్తే కేవలం 500కోట్ల అభివృద్ధి చేశాడని , అదే తమ నాయకుడు పోచారం 10వేల కోట్లతో అభివృద్ధి చేశాడన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో అడుగుపెడుతూనే బాజిరెడ్డికి అభివృద్ధి కనబడటం లేదా అని ప్రశ్నించారు. వలస నాయకులు వస్తుంటారు, పోతుంటారు, బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు కేవలం పోచారం వెంటే ఉంటారన్నారు. మరోసారి పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై అవాకులు , చవాకులు పేలితే ఖబడ్దార్ అని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇళ్లయినా ఇప్పించండి సారూ

- ఇల్లు కట్టకున్నా కట్టుకున్నట్టు ఆన్‌లైన్‌లో వస్తుందంటున్న అధికారులు
- సులేమాన్ నగర్ గ్రామస్థుల వేడుకోలు



మాట్లాడుతున్న దృశ్యం

రుద్రూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సులేమాన్ నగర్ గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాలు ఇప్పుడైనా తమకు ఇండ్లు కట్టించి ఇవ్వాలని అధికారులకు వేడుకుంటున్నారు. శుక్రవారం గ్రామంలో ఆ కుటుంబాలు తమ గోడును చెప్పుకున్నారు. సులేమాన్ నగర్ గ్రామానికి చెందిన షేక్ జరీనా బేగం, షేక్ కరీం, షేక్ షాహిన్ బేగం, ఖాజా పాషా, షాంకీబాయిల కుటుంబాలు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం దరకాస్తు చేసుకున్నామని అయినప్పటికీ తమ పేర్లు లిస్ట్‌లో రాలేదని వాపోయారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా గతంలోనే తమ పేరుపై ఇల్లు వచ్చాయని బిల్లులు వచ్చాయని అధికారులు అంటున్నారని వాపోయారు. అధికారులు స్పందించి వెంటనే తమ సమస్యను పరిష్కరించి ఇప్పుడైనా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని వేడుకుంటున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



నాగేపూర్ సొసైటీ మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ శైలేష్

నవీపేట,సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించి అన్ని గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నాగేపూర్ సొసైటీ మహజన సభలో తీర్మానించారు. శుక్రవారం నాగేపూర్ సొసైటీ ఆవరణలో 64వ మహజన సభ నిర్వహించి పలు తీర్మానాలు ఆమోదించారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యానికి బోనస్ చెల్లించాలని, వరదల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని తీర్మానించారు. మట్టయ్య ఫారంలో ఎరువుల గోదాం నిర్మించాలని, యంచలో మినీ కార్యాలయం నిర్మించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శైలేష్ కుమార్, శ్రీనివాస్ రావు, సాయన్న, ధర్మాజీ, శ్రీదర్ బాబు, చందరి లక్ష్మణ్, కార్యదర్శి రమేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

రెంజల్,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సకాలంలో రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో సొసైటీ స్పెషల్ ఆఫీసర్ అశోక్ కుమార్ అధ్యక్షతన మహజన సభను నిర్వహించారు. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా ఉండాలంటే ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల ధాన్యాన్ని దళారుల పాలు కాకుండా చూడాలని రైతులు కోరారు. యాసంగి పంట బోనస్‌ను ప్రభుత్వం అందించాలని మహజన సభలో తీర్మానించారు. మహజన సభలో జమఖర్చుల వివరాలను సీఈవో ఇంద్రసేన్ సభ్యులకు వినిపించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో ఇంద్రసేన్‌చ మాజీ చైర్మన్ మొయినొద్దీన్, రైతులు అంజయ్య, చంద్రకళ, మధుసూదన్ రెడ్డి, సిబ్బంది కిషోర్, శ్రీనివాస్, సాయిబాబా, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువుల పట్ల తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి



బీర్కూర్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి

బీర్కూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లలను రెగ్యులర్‌గా కళాశాలకు పంపించాలని, వారి చదువుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని బీర్కూర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను రెగ్యులర్‌గా కళాశాలకు పంపించాలని కోరారు. తన కళాశాలలో జేఈఈ మెయిన్స్, నీట్, ఫిజిక్స్‌వాలా కాన్ అకాడమీ వారి ఆధ్వర్యంలో క్లాసులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతీ క్లాసులో సీసీ కెమెరా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రాములు, మాజీ ఎంపీపీ రఘు, బసవరాజు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పద్మ, విఠల్, అధ్యాపకులు చంద్రశేఖర్, సత్తన్న, రంజిత్, దేవి సింగ్, సతీష్, నారగౌడ్ , సౌమ్య, బాలకిషన్, సుభాష్, రాకేష్ విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

'తల్లిదండ్రుల అధ్యాపకుల భాగస్వామ్యం కీలకం'

లింగంపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ప్రగతికి తల్లిదండ్రులు, అధ్యాపకుల భాగస్వామ్యం చాలా కీలకమని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ అన్నారు. శుక్రవారం కళాశాలలో టీచర్స్ పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. తరుచుగా తల్లిదండ్రులు, అధ్యాపకులు సమావేశం అయితే పిల్లల భవిష్యత్‌కు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించవచ్చని అన్నారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడంలో తల్లిదండ్రులు, అధ్యాపకుల సమన్వయం చాలా ముఖ్యమన్నారు. కళాశాలలో ఉచిత విద్య, పాఠ్య పుస్తకాలతో పాటు ఈ విద్యా సంవత్సరం నుంచి సైన్స్ విద్యార్థులకు ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ ద్వారా ఎప్‌సెట్, జేఈఈ, నీట్ క్లాట్ వంటి పోటీ పరీక్షలకు ఆన్‌లైన్ క్లాసులను అందిస్తున్నామని, విద్యార్థుల భద్రత కోసం ప్రతి తరగతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మానసిక ఆరోగ్యం కోసం హెల్ప్ కార్యక్రమం, టెలి - మానస్, శిక్షణ పొందిన విద్యార్థి కౌన్సిలర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం మౌలిక వసతుల కోసం నిధులు విడుదల చేసిందన్నారు. 2025 మార్చి ఇంటర్మీడియట్ ఫలితాలలో ప్రభుత్వ జూనియర్ జిల్లాలో మొదటి ర్యాంకు సాధించిందని చెప్పారు. ఈ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించిన విద్యార్థులు గ్రూప్ 2తో పాటు అనేక ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు దుర్గయ్య, రాజయ్య, నాగు, స్వామిగౌడ్, దర్‌సింగ్, అంజయ్య, అజమ్మ, శ్రీలత, షైమద్, సంధ్య ఉన్నారు.

నిత్య పూజలందుకుంటున్న అమ్మవారు

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారు నిత్యపూజలందుకుంటున్నారు. పట్టణంలోని అయా మండపాల నిర్వహకులు శుక్రవారం అమ్మవారిని శ్రీలలితాత్రిపుర సుందరీ దేవి అవతారంలో అలంకరించారు. చైతన్యకాలనీలో సబ్‌కలెక్టర్ కిరణ్మయి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాటి శివరాజులు గుప్త, రామకృష్ణ గుప్త, ప్రశాంత్‌గుప్త కుటుంబ సభ్యులు భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు భీంరాజ్, హన్మాండ్లు , ప్రవీణ్ , సచిన్ , భక్తులు సంజీవ్ , వెంకన్న , సంగమేశ్వర్ , కాశీ తదితరులున్నారు.

లలితా త్రిపుసుందరీ దేవి అవతారంలో అమ్మవారు

దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలోని విద్యాజ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో అమ్మవారు శుక్రవారం లలితాత్రిపురసుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు ఆలయంలో హోమం, అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో ఆ లయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శంభురెడ్డి దంపతులు, వినోద్ , శ్రీనివాస్ ,అరుణ్‌రెడ్డి, భక్తులు తదితరులున్నారు.

అమ్మవారి సేవలో మాజీ ప్రజాప్రతినిధులు

పెద్ద కొడప్‌గల్: మండల కేంద్రంలో దేవి నవరాత్రుల సందర్భంగా ప్రతిష్ఠించిన జై భీం దుర్గా మండలి అమ్మవారిని శుక్రవారం మండల మాజీ ఎంపీపీ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతు అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలలో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మాజీ ఎంపిపి పాల్గొని ప్రసాదం వడ్డన చేశారు.



బాన్సువాడ పెద్దహనుమాన్ మందిరంలో కొలువుదీరిన అమ్మవారు



ఎల్లారెడ్డిలో మహాలక్ష్మీ రూపంలో అమ్మవారు

మహాలక్ష్మి రూపంలో దుర్గామాత

ఎల్లారెడ్డి: పట్టణ కేంద్రంలోని పోచమ్మ ఆలయంలో చైతన్య యూత్, హిందూ యువ సేన సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. శుక్రవారం నాడు అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన భక్తి భావంతో సాగాయి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, సామూహిక కుంకుమార్చన చేసి అమ్మవారిని పూజించారు. ఈ కార్యక్రమం ద్వారా యువతలో భక్తి, సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు ప్రయత్నాలు జరిగాయని, భక్తి భావనలు మరింత బలపడ్డాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్య యూత్, హిందూ యువ సేన సభ్యులు ప్యాలాల రాములు, సంగమేశ్వర్, పప్పు వెంకట్, రమేష్, ప్రభాకర్, శివప్రసాద్, విద్యాసాగర్, నవీన్, అర్జున్ గౌడ్, సాయి, భాను, అర్జున్, ఫణి, కిరణ్, రాహుల్, సూర్య, కపిల్, తరుణ్, సాయిరాజ్, భాస్కర్, మధు, చందు, సంజయ్, ఈశ్వర్, వినీత్, నాగబాబు, సన్నీ, నిహాళ్, మహిళలు పాల్గొన్నారు.

దేవి మండపాల్లో అమ్మవారికి కుంకుమార్చనలు

భిక్కనూరు: మండలంలో దేవి శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మండలకేంద్రంతో పాటుగా మండ లంలోని ఆయాగ్రామాల్లో శరన్నవరాత్రుల్లో బాగంగా ఐదవ రోజు అమ్మ వారిని అర్చకులు అలంకరించగా మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

'పత్తి' మీద సాగు

(5వ పేజీ తరువాయి)

చూపుతోంది. భారీ వర్షాలతో నల్లరేగడి నేలలు నీటిని ఎక్కువగా పీల్చుకొని పత్తి పంట ఎదగని పరిస్థితి తలెత్తింది. కలుపు తీయడం కష్టం అవుతోంది. వేలాది ఎకరాల్లో పత్తి ఎడతెగని పరిస్థితులతో ఓ వైపు ఎర్రబారిపోవడం, మరో వైపు కలుపు సమస్య తీవ్రమై దిగుబడులు సరిగా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దిగుబడులపై ప్రభావం

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు వరదల వల్ల పత్తి పంటపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో దిగుబడులు ఆశించిన మేర రావని రైతులే కాకుండా వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. రెండు, మూడు రోజుల పాటు పత్తి పంట వరదల్లో ఉండిపోవడంతో పంట మురిగిపోగా మరికొన్ని చోట్ల మొక్క ఎదుగుదలపై తీవ్ర భావం నెలకొంటుంది. పూత, కాత కాయకపోవడంతో వేసిన పంట నీరుపట్టి ఎర్ర బడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పత్తి దిగుబడులు రావడం లేదు. ఎకరాన గతంలో 10 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చేవి. భారీ వర్షాల ప్రభావంతో ప్రస్తుతం ఎకరాన పత్తి 7 నుంచి 8 క్వింటళ్ల వరకు మాత్రమే వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఇలా ఎకరాన మూడు క్వింటాళ్ల వరకు దిగుబడులు తగ్గడంతో నష్టం వాటిల్లనుందన్నారు. జిల్లా వ్యాప్తం 31 వేల ఎకరాల్లో పత్తి సాగయింది. వరదల ప్రభావంతో ఈ సారి 2700ల మెట్రిక్ టన్నుల దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.



కరడ్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రామ రామ రామ ఉయ్యాలో..

(5వ పేజీ తరువాయి)

ప్రారంభించారు. ఈ సందర్భంగా బతుకమ్మలను కళాశాల ఆవరణలో పెట్టి విద్యార్థినులు, మహిళా సిబ్బంది బతుకమ్మ ఆడారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి పండుగలు మన సంస్కృతిని, సాంప్రదాయాన్ని నిలుపుకుంటూ విద్యార్థుల్లో సామూహిక చైతన్యాన్ని పెంపొందించేందుకు తొడ్పడతాయని అన్నారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 5 వరకు ఇంటర్మీడియేట్ బోర్డు ఆదేశాల మేరకు దసరా సెలవులు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: బతుకమ్మ పండుగ మహిళా సోదరీమణులకు అతిపెద్ద పండగ అని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ ఉద్యోగులు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీవో జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం మహిళలతో బతుకమ్మ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ బతుకమ్మ ఆడడానికి మహిళలు ఎంత ఉత్సాహాన్ని చూపి ఎంతో ఆనందంగా నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. పండుగలు అంగరంగ వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వ సూచనల మేరకు వేడుకలు నిర్వహించడం జరుగుతుందని. రోజూ వివిధ మండలాల ప్రభుత్వకార్యాలయాల్లో నిర్వహించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్, రెవెన్యూ మహిళా ఉద్యోగులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కమిషనర్ మహేష్ కుమార్ బతుకమ్మ వేడుకలను నిర్వహి ంచారు.

బాన్సువాడ టౌన్: బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. మహిళలు వివిధ రాకల పూలతో బతుకమ్మను పేర్చారు. మహిళా ఉద్యోగులు డీజేపాటలపై బతుకమ్మ ఆటలు ఆడారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ శ్రీహరిరాజు, సిబ్బంది తదితరులున్నారు.

భూమి కోసం పోరాడిన వీర వనిత ఐలమ్మ

(5వ పేజీ తరువాయి)

అధికారులకు అన్ని విషయాలపై పూర్తి అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిక్షణ కార్యక్రమం సద్వినియోగం చేసుకుని సందేహాలు ఏమైనా ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పూర్తి బాధ్యతాయుతంగా ఉండాలని పొరపాట్లు జరిగితే చట్టపరమైన చర్యలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారి మురళి, జిల్లా పరిషత్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమేష్‌బాబు, డీఎల్‌పీవో శ్రీనివాస్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఈవో యోసఫ్, ఎంపీవో సురేందర్ పాల్గొన్నారు.

1 నుంచి వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

జిల్లాలోని ఖరీఫ్ సీజన్‌లో పండించిన వరి పంట సుమారుగా 5.99 లక్షల మెట్రిక్ టన్నులు రానున్నట్లు గుర్తించామని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేది నుంచి వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తెలిపారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సొసైటి 233, ఐకేపీ 194 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సరిపడ గోనే సంచులను, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. తెమ శాతం తెలిపే మిషన్లు, ప్యాడీక్లీనర్స్ తాగు నీటి సదుపయం, టార్పాలిండ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులకు టోకేట్లను ఇవ్వాలని, తేమ శాతం 17 ఉండేటట్లు చూసుకొని కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్‌మిళ్లలకు పంపాలని తెలిపారు. ఎవ్వైన సమస్య ఉంటే టోల్‌ఫ్రీ నెంబరు. 08468220051ను సంప్రదించాలని తెలిపారు.

ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ చూసించారు. శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్.రామకృష్ణరావుతో టెలికాన్ఫరెన్సులో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినందున ఎలాంటి ధన, ప్రాణ నష్టం కలుగకుండా స్థానిక అధికారులు సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

దేవాలయాల దోపిడీ ముఠా అరెస్టు

(5వ పేజీ తరువాయి)

విచారణ చేపట్టి 157 సెల్ ఫోన్లను రికవరీ చేశామని ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. మొబైల్ పోయినా లేదా చోరీకి గురైన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి సిమ్‌కార్డు బ్లాక్ చేసి మరో సిమ్ కార్డు తీసుకోవాలని తెలిపారు. సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా సెల్‌ఫోన్లను గుర్తించడం వీలుందని తెలిపారు. ఇప్పటి వరకు 3,862 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు.

సీనియార్టీ ప్రకారం ఎన్నికల బాధ్యతలు అప్పగించాలి

(5వ పేజీ తరువాయి)

సీనియర్టీ ప్రాతిపదికన ఉపాధ్యాయులకు విధులు కేటాయించాలని శుక్రవారం డీఈవో రాజుకు వారు వినతిపత్రం అందజేశారు. వికలాంటులకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఈ సందర్భంగా డీఈవోను కోరారు. వీటిపై డీపీవోను కలిసి వినతిపత్రాలు అందజేశామన్నారు.



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



బీబీపేటలో జయంతి నిర్వహిస్తున్న దృశ్యం



పెద్దమల్లారెడ్డిలో..



కామారెడ్డి: నివాళులు అర్పిస్తున్న నాయకులు

పోరాటయోధురాలు.. చాకలి ఐలమ్మ

తెలంగాణ వీరనారీ చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శప్రాయమని వక్తలు పేర్కొన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో ప్రతిఒక్కరు ముందుకు సాగాలన్నారు. వివిధ రాజకీయ పార్టీలు, యువజన సంఘాలు, కుల సంఘాల ఆధ్వర్యంలో జయంతి నిర్వహించి, ఐలమ్మకు నివాళులర్పించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



కామారెడ్డిలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



తాడ్వాయిలో జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

గ్రూప్-1లో కామారెడ్డి ప్రభంజనం

గ్రూప్-1 ఫలితాల్లో కామారెడ్డి జిల్లావాసులు సత్తాచాటారు. పట్టుదలతో చదివి కలల కొలువును సాధించారు. ఉన్నతస్థాయిలో స్థిరపడి జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొస్తామని వారు తెలిపారు. వారి విజయంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రెజరీ ఆఫీసర్‌గా ముంబాజీపేట వాసి

లింగంపేట, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూరుమూల గ్రామం ముంబాజీపేటతండాకు చెందిన బానోత్ గంగూలీ గ్రూప్-1 కొలువుకు ఎంపికయ్యాడు. 10వ తరగతి వరకు మండలంలోని భవానిపేటలో చదువుకుని, ఇంటర్ గాంధారిలోని ట్రైబల్ వెల్‌ఫర్‌లో, డిగ్రీ కామారెడ్డిలోని ట్రైబల్ వెల్ఫేర్‌లో చదువుకున్న గంగూలీ సివిల్‌లో ర్యాంకు సాధించాలని పట్టుదలతో ప్రిపరేషన్ మొదలు పెట్టి అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా ఎంపికయినట్లు ఆయన తెలియజేశారు. ఆయన కుటుంబ సభ్యులు, గ్రామసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గంగూలీ

డీఎస్పీగా ఇబ్రహీంపేట్ యువకుడు

బాన్సువాడ రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మాలెపు నారాయణ రెడ్డి మనుమడు ప్రభాతరెడ్డి గ్రూప్-1 రాష్ట్రస్థాయి ఫలితాల్లో 73వ ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. గతంలో గ్రూప్-4 ఉద్యోగాన్ని సాధించి, ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ గ్రూప్-1కు ప్రిపేర్ అయినట్లు తెలిపారు. తన మనుమడు చిన్ననాటి నుండి ప్రజలకు సేవ చేయడానికి తాపత్రయ పడేవాడని, చదువులో చిన్నతనం నుండే బాగా రాణిస్తూ గ్రూప్-1 సాధించాడని మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి తెలిపారు.



బీసీ వెల్ఫేర్ అధికారిగా రామారెడ్డి ఎస్సై లావణ్య

రామారెడ్డి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చదువుకునే రోజుల్లో కష్టపడి చదువుకుంటేనే ఉన్నత పదవులు వస్తాయని గ్రూప్ -1లో విజయం సాధించిన ఆర్.లావణ్య పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రస్తుతం రామారెడ్డి ఎస్సైగా లావణ్య విధులు నిర్వహిస్తుండగా గ్రూప్ -1లో జిల్లా బిసి వెల్ఫేర్ అధికారిగా అధికారిగా ఎంపికైనట్లు ఆమె తెలిపారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం చెబర్తి గ్రామంలో పుట్టానని ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి చెబర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివానని తెలిపారు. నిర్మల్ జిల్లా బాసరలో బి - టెక్ పూర్తి చేసి, ఎక్సైజ్ కానిస్టేబుల్ చేస్తుండగా ఎస్సై పదవి పొందినట్లు, ప్రస్తుతం రామారెడ్డి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నానని గ్రూప్ -1 లో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిగా ఎంపికైనట్లు వివరించారు. నాకు ప్రోత్సహించిన అధికారులు గోపినాథ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భర్త నాథ్ రాములు సేవలు మరువలేనివి. అదే విధంగా ఎస్సై లావణ్య భర్త రాములు కూడా ఉన్నత చదువులు అభ్యసిస్తూ ఉన్నతస్థాయిలో ఎదగడానికి కృషి చేస్తున్నారు. ఎస్సై ఎంపికపై అంతటా హర్షం వ్యక్తమవుతోంది.



రామారెడ్డి ఎస్సై లావణ్య

ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ



మీసన్‌పల్లిలో శిక్షణ ఇస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిరూరల్, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రిసైడింగ్ అధికారులకు శుక్రవారం మీసన్‌పల్లిలో డీఎల్‌పీవో సురేందర్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. అధికారులు తన బాధ్యతలను, నిబంధనలను పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఎన్నికల నామినేషన్లు నుండి ఫలితాల వరకు అనుసరించాల్సి జాగ్రత్తలను వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడివో ప్రకాష్, వివిధ శాఖల ఉద్యోగులు ఉన్నారు.



దోమకొండలో మాట్లాడుతున్న ఎంపీడీవో

దోమకొండ,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శుక్రవారం ప్రిసైడింగ్ అధికారులకు స్థానిక సంస్థల ఎన్నికలపై శిక్షణ ఇచ్చారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని, ఎవరికి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలప్రత్యేక అధికారి జ్యోతి, విజయ్‌కుమార్, టీఓటీ నర్సయ్య, నర్సింహ,శర్మ తదితరులున్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- భద్రకాళీ
ప్రియ 35- లిటిల్ హార్ట్స్
దర్శన్- మిరాయి

బాన్సువాడ

మహేశ్వరి - ఓజీ
వెంకటేశ్వర - కిష్కింధపురి

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.160	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230


సదాశివనగర్‌లో వైద్యశిబిరం

సదాశివనగర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం ఎస్ఎన్ఎస్‌పీ వైద్యశిబిరాన్ని నిర్వహించినట్లు డా.ఆస్మా తెలిపారు. కామారెడ్డి జీజీహెచ్ నుంచి 8మంది నిపుణులు 150మంది రోగులకు పరీక్షలు చేసి, మందులు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

బాన్సువాడ రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతులకు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని మండలంలోని బుడిమి సొసైటీ వైస్‌చైర్మన్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తాడ్కోల్ రైతు వేదికలో సొసైటీ మహాజన సభను వైస్‌చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సొసైటీ లాభాల బాటలో పట్టేందుకు ప్రతిఒక్కరు సహకరించాలని ఆయన పేర్కొన్నారు. యాసంగిలో కొనుగోలు చేసిన ధాన్యానికి బోనస్‌తో పాటుగా పంట బీమా, మిషన్ల కొనుగోలు చేయడానికి సభ్యులు తీర్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణ, డైరెక్టర్లు రాంరెడ్డి, బాలరాజు, గంగారాం, శంకర్ రైతులు పాల్గొన్నారు.

బంజార యూత్ ఉపాధ్యక్షుడిగా నరేష్



నియామకపత్రాలను అందజేస్తున్న సంఘం నాయకులు

ఎల్లారెడ్డిరూరల్ సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా బంజార సేవా సంఘం కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎల్లారెడ్డి మండల పరిధిలోని హాజీపూర్‌తండాకు చెందిన బాదవత్ నరేష్, ఎల్లారెడ్డి యూత్ ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్ ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నికయ్యారు. వారికి జిల్లా అధ్యక్షుడు సురేందర్ రాథోడ్, జిల్లా యూత్ అధ్యక్షుడు శంకర్‌నాయక్ నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు కోల రాములు, సర్దార్ సేవ్య, ఓంకార్, రవికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు

(5వ పేజీ తరువాయి)

అన్నప్రసాద వితరణ చేపట్టారు. అలాగే పెద్దమ్మ దేవి ఆలయంలో కుంకుమార్చనలు నిర్వహించారు. ఆయా కాలనీల్లో పెట్టిన దుర్గమాత విగ్రహాల వద్ద కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు.

సరస్వతీ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం అడ్లూర్ గ్రామ పరిధిలోని ఇల్చిపూర్ శివారులో గల సరస్వతి దేవి ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మ వారికి పర్వదినం ఉదయం నుంచే భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మ వారికి కుంకుమార్చనలు, హారతి వంటి పూజ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు క్యూలో నిలబడి అమ్మ వారికి మొక్కులు తీర్చున్నారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండలంలోని సీతారాంపూర్ గ్రామంలోని విశ్వహిందు యూత్ అసోసియేషన్ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీ దుర్గాదేవి మండపం వద్ద కుంకుమార్చన పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్వహిందు యూత్ అసోసియేషన్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. కాగా మండల కేంద్రంలోని శివరాంమందిర్ దుర్గామాత ఆధ్వర్యంలో శుక్రవారం 80 బోనాలతో గ్రామ దేవతలకు నైవిద్యం సమర్పించారు. స్థానిక చెరువు వద్ద గంగాబోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెటిక సంఘం ఆధ్వర్యంలో అమ్మవార్లకు నైవిద్యం సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెరిక సంఘం పాండిదారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హామీల అమలుకు పోరాడుతాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

పాల్వంచ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటం చేస్తామని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ అన్నారు. శుక్రవారం పాల్వంచ మండల బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని మండలకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్రలో సీఎం రేవంత్‌రెడ్డి ఫెయిల్యూర్ ముఖ్యమంత్రిగా మిగిలిపోతారని, బీసీలకు, మహిళలకు, విద్యార్థులకు ఇలా సకల వర్గాలను మోసం చేశాడని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హమీల అమలుకు పార్టీ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో పోరాటాలు చేసి ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు పార్టీలో ఉండి పార్టీ ఓడిన తర్వాత పార్టీని విడిచిపోయిన వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబోద్దిన్, మాజీ జడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డి, బాల్‌చంద్రం, శేఖర్, గోవిందరెడ్డి, గంగారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, హంజీనాయక్, శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గాంధారి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలోని రైతువేదికలో ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. మొత్తంగా 96 పీవోలు ఉంటే 92మంది పీవోలు హజరయ్యారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీహరి, టీవోటీలు స్వామి, శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.



గాంధారిలో మాట్లాడుతున్న అధికారులు

బీఆర్ఎస్ పాల్వంచ అధ్యక్షుడిగా రాజాగౌడ్

పాల్వంచ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాల్వంచ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా బొంబోతుల రాజాగౌడ్, ప్రధాన కార్యదర్శిగా విద్యాసాగర్‌రావు, కోశాధికారిగా నరేష్, అనుబంధ సంఘాల యువత అధ్యక్షుడిగా గంగారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా చెప్యాల ఎల్లయ్య, రైతు విభాగ అధ్యక్షుడిగా గంగారెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా రవి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా కూచని లావణ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా అన్వర్, బీసీ సెల్ అధ్యక్షుడిగా నర్సింలును నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రమేష్

లింగంపేట,సెప్టెంబర్26(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ కోమట్‌పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రమేష్‌గౌడ్‌ను ఎన్నుకున్నట్లు మండలాధ్యక్షుడు నారాగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫీక్, దశరథ్ నాయక్, నగేష్, ఎల్లమయ్య, కౌడ రవి, భాస్కర్‌గౌడ్, నాగరాజు, బలకిషన్, సుప్పాల రాజులతో పాటు నాయకులు ఉన్నారు.